సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



టామ్‌కామ్‌తో భరోసా

విదేశాలకు వెళ్లేవారికి టామ్‌కామ్ బాసటగా నిలుస్తోంది. విద్యార్హతలు, నైపుణ్యం మేరకు కొలువులు సమకూర్చే విధంగా సేవలందిస్తోంది. 8లో▸



క్రీడల్లో గెలుపోటములు సహజం

జిల్లాలోని వివిధ మండలాల్లో సీఎం కప్ క్రీడాపోటీలు నిర్వహించారు. విద్యార్థులకు వాలీబాల్, అథ్లెటిక్స్, కోకో, కబడ్డీ క్రీడల్లో పోటీలు నిర్వహించారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0 /14.0

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది. ఈదురుగాలులు వీస్తాయి.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే...

- జిల్లాలో 2.05 లక్షల దరఖాస్తులు
- 8,465 ఇళ్ల సర్వే పూర్తి
- 7,360 ఆన్‌లైన్‌లో నమోదు
- అనర్హులను గుర్తిస్తున్న యాప్


జిల్లా కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న సిబ్బంది

మంచిర్యాలటౌన్: సొంతిళ్లు లేక జిల్లాలో చాలామంది పేద, మధ్యతరగతి ప్రజలు కాలం వెల్లదీస్తున్నారు. వేలాదిమంది ఇప్పటికీ అద్దె ఇళ్లలోనే జీవనం సాగిస్తున్నారు. సొంతగూడులేక గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో అనేకమంది అవస్థలు పడుతున్నారు. వారికి గూడు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పథకం పేరుతో ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందుకుగానూ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గతంలోనే మహిళల పేరిట దరఖాస్తులు స్వీకరించింది. అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందకుండా కేవలం అర్హులకు మాత్రమే అందించేలా ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో మూడు రోజులుగా సిబ్బంది జిల్లాలోని దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి సర్వే చేస్తున్నారు. సర్వే సిబ్బంది దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి లబ్ధిదారుల ఫొటోలు తీసుకుంటున్నారు. దీంతోపాటు ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి స్వరూపం, ఇల్లు నిర్మించుకునేందుకు భూమి అందుబాటులో ఉందా? లేదా?, స్థలం ఉంటే ఎవరి పేరిట ఉంది, ఇంట్లో ఉన్న వివాహిత జంటల సంఖ్య, ప్రస్తుతం అక్కడే వారు ఎన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు, లబ్ధిదారు దివ్యాంగులా, అనాథలా, ఒంటరి మహిళా, వితంతువా, ట్రాన్స్‌జెండర్లు, పారిశుద్ధ్య కార్మికులు వంటి వాటిని యాప్ ద్వారానే గుర్తించనున్నారు. ప్రభుత్వం ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఈ విభాగం వారికే ప్రాధాన్యత ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. సర్వే చేస్తూనే ప్రతీ మండలంలో నమూనా ఇంటి నిర్మాణంను చేపట్టి, దాని ప్రకారంగానే ఇళ్ల నిర్మాణం ఉంటుందని అధికారులు ప్రజలకు చూపించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

సర్వే ద్వారా యాప్‌లో నమోదు

ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా గ్రామాల్లో కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సర్వే చేస్తున్నారు. గెజిటెడ్ స్థాయి అధికారి సర్వేను పరిశీలించనున్నారు. జిల్లాలో మూడు రోజులుగా సర్వే నిర్వహిస్తున్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకోసం 2,05,939 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు 8,465 దరఖాస్తులను పరిశీలించగా, 7,365 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అసంపూర్తిగా నమోదు చేసిన దరఖాస్తులు 1,105 ఉండగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు నాలుగుశాతం మాత్రమే సర్వే పూర్తయింది. మూడు రోజులుగా మండలాలు, మున్సిపాలిటీల్లో సర్వే చేపడుతున్నా అనుకున్నంత వేగంగా జరగడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో సెల్ ఫోన్ సిగ్నల్స్ సక్రమంగా లేకపోవడంతో ఇంటర్నెట్ రాక ఆయా దరఖాస్తుదారుల వివరాలను యాప్‌లో ఆన్‌లైన్ చేయలేక పోతున్నారు. మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉండడంతో ప్రత్యామ్నాయంగా ఆయా గ్రామాల్లోని దరఖాస్తుదారుల సర్వేను ఏవిధంగా చేపట్టాలనే దానిపై అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. మున్సిపాలిటీల్లో దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉండగా సర్వేలో వెనకబడుతున్నారు. వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేసి, లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారనే విషయాలను సేకరించి, ప్రభుత్వానికి నివేదించేందుకు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. సర్వేకు వచ్చిన సిబ్బందికి దరఖాస్తుదారులు సంబంధిత ధృవపత్రాలను కలిగి ఉండి, అడిగిన వాటికి సమాధానం చెబితే సర్వే ప్రక్రియ వేగవంతం అవుతుందని, లబ్ధిదారులు సహకరించి సరైన వివరాలు అందిస్తే ప్రక్రియ త్వరగా పూర్తికావడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ నెల 20వ తేదీ వరకు సర్వే పూర్తి చేసి మొదటి దశలో అత్యంత పేదలను గుర్తించి, వారికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది. సర్వే అనంతరం జాబితాను ఆయా గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో గల ఇందిరమ్మ కమిటీలకు అందించనున్నారు. కమిటీ సభ్యులు ఆయా జాబితాలో ఉన్న వారి పేర్లను పరిశీలించి, వారు అర్హులా? కాదా? అని నిర్ణయించి, కమిటీ ఆమోదం చేసిన లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేయనున్నారు.

గురువారం వరకు పూర్తయిన సర్వే వివరాలు

మండలం	ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు	సర్వే చేసినవి
బెల్లంపల్లి	8,277	307
భీమారం	4,671	269
భీమిని	4,876	417
చెన్నూర్	10,158	775
దండేపల్లి	13,816	770
హాజీపూర్	8,214	294
జైపూర్	9,958	535
జన్నారం	15,560	264
కన్నెపల్లి	6,271	171
కాసిపేట	8,829	296
కోటపల్లి	10,912	451
లక్సెట్టిపేట	7,926	249
మందమర్రి	4,057	96
నెన్నెల	7,549	753
తాండూర్	9,443	349
వేమనపల్లి	5,937	331
మున్సిపాలిటీ	**దరఖాస్తులు**	**సర్వే చేసినవి**
బెల్లంపల్లి	12,280	58
చెన్నూర్	5,648	145
క్యాతన్‌పల్లి	6,258	539
లక్సెట్టిపేట్	4,918	280
మంచిర్యాల	18,163	261
మందమర్రి	10,011	770
నస్పూర్	12,207	85
మొత్తం	2,05,939	8,465

న్యూస్‌రీల్

మంచిర్యాలలో వందేభారత్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలి


రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం అందిస్తున్న పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ

మంచిర్యాలటౌన్: పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని, మంచిర్యాలలో వందేభారత్ రైలుకు హాల్టింగ్ ఇవ్వాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. ఈమేరకు గురువారం వినతిపత్రంను అందించారు. ఎంపీ మాట్లాడుతూ తన వినతికి రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారని, హాల్టింగ్ సమస్యపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారని వెల్లడించారు.

విద్యార్థులకు అడవులపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న డీఆర్వో తిరుపతి

జన్నారం: విద్యార్థులకు అడవులపై అవగాహన ఉండాలని జన్నారం డిప్యూటీ రేంజ్ అధికారి తిరుపతి అన్నారు. గురువారం కలమడుగులోని వివేకానంద విద్యార్థులు స్టడీటూర్‌లో భాగంగా జన్నారం రేంజ్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అడవుల రక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్బన్‌డయాక్సైడ్‌ను పొంది స్వచ్ఛమైన ప్రాణవాయువును అందించే అడవులు మానవ మనుగడకు దోహదం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు బటర్‌ఫ్లై గార్డెన్, గ్రాస్‌ల్యాండ్, పార్కు, అధ్యయన కేంద్రాలు, గేట్ నంబర్ 1 నుంచి రెండు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి అడవులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారి లాల్‌బాయి, ప్రిన్సిపాల్ సతీశ్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దచెరువు హద్దుల గుర్తింపు


హద్దులు గుర్తిస్తున్న అధికారులు

వేమనపల్లి: మండలంలోని దస్నాపూర్ పెద్ద చెరువు వద్ద హద్దుల గుర్తింపునకు గురువారం రెవెన్యూ, సర్వే అధికారులు శ్రీకారం చుట్టారు. ఏడీఎస్ఎల్ఆర్ శ్రీనివాస్, ఎంసీ దశరథ్, ఆర్ఐ ఖలీల్ ఆధ్వర్యంలో చెరువు శిఖంపై ఉన్న పట్టాదారుల వివరాలు సేకరించారు. దస్నాపూర్ శివారు 40 సర్వే నంబర్‌లో పెద్ద చెరువు 30 ఎకరాల 18గుంటల విస్తీర్ణంలో ఉంది. కానీ కేవలం 8 ఎకరాలు మాత్రమే మిగిలి ఉండగా మిగతా చెరువు అంతా ఆక్రమణకు గురైంది. శిఖాన్ని ఆనుకుని ఉన్న దస్నాపూర్, కొత్తపల్లి, మంగెనపల్లికి చెందిన పలువురు పట్టా దారులు ఆక్రమించుకొని సేద్యం చేస్తున్నారు. ఈ విషయమై జులై 15న గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆలస్యంగా స్పందించిన అధికారులు చెరువు వద్దకు వెళ్లి పక్కనే ఆనుకుని ఉన్న పట్టాదారులను గుర్తించారు. రెండు రోజుల్లో నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆశ్రమ స్థలాన్ని అప్పగించండి..

దస్నాపూర్ శివారులో ఉన్న వేమనపల్లి ఆశ్రమ పాఠశాల కోసం కేటాయించిన ఐదెకరాల భూమిని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల పేరు మీద పట్టా చేసి హద్దులు గుర్తించి తమ ఆధీనం చేయాలని పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో పాటు ఎకరం 23 గుంటల ఆటస్థలంకోసం కూడా అప్పగించాలన్నారు.

నర్సరీల పరిశీలన


నర్సరీ పనులు పరిశీలిస్తున్న డీఆర్డీవో కిషన్

కాసిపేట: మండలంలోని లంబాడితండా(కె), సోమగూడెం(కె) గ్రామ పంచాయతీల నర్సరీలను డీఆర్డీవో కిషన్ సందర్శించారు. కోనూరులో పశువుల పాక, నాడేపు కంపోస్టు ఫీట్ పనులను ప్రారంభించారు. నర్సరీలో పాడైపోయిన మొక్కల స్థానంలో వేరే మొక్కలు పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో నవీన్‌కుమార్, ఈసీ మల్లేష్, టీఏలు అనూష, వినోద్‌కుమార్, శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు ఉన్నారు.

పోలీసులకు వజ్రాయుధం వజ్రవాహనం

- రామగుండం సీపీ శ్రీనివాసులు


అవగాహన కల్పిస్తున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: అల్లరి మూకలను చెదరగొట్టడంలో వజ్ర వాహనం పోలీసులకు వజ్రాయుధంగా పనిచేస్తుందని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. పోలీస్ శాఖలోని ఏఆర్ విభాగంలో ఇటీవల ఎంపిక చేయబడిన నూతన కానిస్టేబుళ్లకు వజ్ర వాహనం వినియోగంపై గురువారం కమిషనరేట్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వాహనం ద్వారా ఒకేసారి ఏడు సెల్స్ ఉపయోగించి ఫైర్ చేసి అల్లరి మూకలను చెదరగొట్టి పరిస్థితి అదుపులోకి తేవచ్చన్నారు. పెద్ద మొత్తంలో అల్లర్లు జరిగి దాడులకు పాల్పడినప్పుడు వజ్ర వాహనంలో 12 మంది సిబ్బంది ఘటన స్థలానికి నేరుగా చొచ్చుకుపోయే వీలుందన్నారు. నూతనంగా ఉద్యోగంలో చేరిన ఏఆర్ కానిస్టేబుళ్లు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, శ్రీ నివాస్, మల్లేశం, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రి సందర్శన


వివరాలు తెలుసుకుంటున్న డీసీహెచ్ఎస్ కోటేశ్వర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని గురువారం డీసీహెచ్ఎస్ డాక్టర్ కోటేశ్వర్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను నిశితంగా పరిశీలించారు. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ జోసేఫిన్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు


మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్


చిన్నారుల నృత్య ప్రదర్శన

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅర్బన్: చదువుతో పాటు క్రీడలు విద్యార్థి భవిష్యత్‌కు బాటలు వేస్తాయని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల కేంద్రీయ విద్యాలయంలో వార్షిక (స్పోర్ట్స్ డే) క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలతో చదువులో ఏకాగ్రత, ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పిల్లలు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. విద్యాలయంలో ప్రేరణ ఉత్సవ్, పుస్తకోపహర్, పర్యావరణ దినోత్సవం, అంతర్జాతీయ యోగా దినోత్సవం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి.

రోడ్డు నిర్మాణం అడ్డుకోవద్దని ధర్నా


రేంజ్ కార్యాలయం ఎదుట బైఠాయించిన కోణంపేట గ్రామస్తులు

నెన్నెల: కోణంపేట రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకోవద్దని గురువారం గ్రామస్తులు నెన్నెల రేంజ్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. నెన్నెల–కోణంపేట రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఉన్నప్పటికీ అధికారులు పనులు నిలిపివేయడంపై గ్రామస్తులు మండిపడ్డారు. రోడ్డు పనులకు అడ్డు చెప్పవద్దంటూ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. కలెక్టర్, డీఎఫ్‌వో తక్షణమే రావాలని డిమాండ్ చేస్తూ మూడు గంటలపాటు ఆందోళన నిర్వహించారు. అనంతరం నెన్నె ల రేంజ్ ఆఫీసర్ అందుబాటులో లేకపోవడంతో రెబ్బెన సెక్షన్ ఆఫీసర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక 25 ఏళ్లుగా అవస్థలు పడుతున్నామన్నారు. అత్యవసర సమయాల్లో 108 కూడా గ్రామానికి రాలేని దుస్థితి ఉందన్నారు. రోడ్డు సౌకర్యం సరిగా లేక చనిపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. వర్షాకాలం అత్యవసర పరిస్థితుల్లో అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ఎడ్లబండిపై, కాలినడకన ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఇటీవల రోడ్డు పనులు ప్రారంభం కావడంతో దశాబ్దాల కల నెరవేరుతుందని ఆశపడ్డామని, రిజర్వు ఫారెస్ట్‌లో పనులు చేయవద్దంటూ అటవీశాఖ అధికారులు పనులు నిలిపివేశారన్నారు. కంకర లారీలను, యంత్రాలను పని స్థలానికి రా కుండా అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. ఈ నెల 30 వరకే రోడ్డు నిర్మాణానికి గడువు ఉండటంతో ఆందోళన చెందుతున్నామన్నారు. రిజర్వు ఫారెస్ట్‌లో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు తీసుకున్న తర్వాతనే పనులు చేపడుతున్నామని కాంట్రాక్టర్ పేర్కొన్నారు. రిజర్వు ఫారెస్ట్‌లో సుమారు 3 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖకు అనుమతులు ఉ న్నాయని సెక్షన్ ఆఫీసర్ బాలకృష్ణ తెలిపారు. అనుమతి పొందిన పీఆర్ వారు కాకుండా ప్రస్తుతం ఐటీడీఏ వారు పనులు చేపడుతున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయడం వల్లే నిలిపివేశామని చెప్పారు. ఐటీడీఏ పేరిట అనుమతులు తెచ్చుకొని పనులు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాంటెంకి శ్రీనివాస్, కొడిపె శంకర్, తోడె బాపురెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జక్కయ్య, బికారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో 'నిఘా' ఏది?

- అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు
- ఊసేలేని బయోమెట్రిక్
- ఎఫ్ఆర్ఎస్ అమలుకు సన్నాహాలు
- అక్రమాలకు చెక్

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ వసతిగృహాల విద్యార్థులకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు) మూలనపడ్డాయి. హాస్టళ్లలో సంక్షేమ అధికారుల పర్యవేక్షణ, సిబ్బంది పనితీరు, విద్యార్థులకు అందుతున్న మెనూ, హాజరు అంతా సీసీ కెమెరాల్లో నిక్షిప్తం అయ్యేలా ఏర్పాట్లు చేశారు. హాస్టల్‌లోకి ఇతర వ్యక్తులు ఎవరైనా వస్తున్నారా? విద్యార్థులు ఎవరైనా బయటకు వెళ్తున్నారా? స్టోర్ రూంలో సరుకుల నిల్వలు, కిచెన్‌లో వంట పనుల తీరు సమగ్రంగా పర్యవేక్షించే వీలుండేది. వీటి నిర్వహణ నిధులు ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయి. దీంతో పర్యవేక్షణ కొరవడటంతో కడుపునిండా నాణ్యమైన భోజనం మాటెలా ఉన్నా వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య, సరుకుల కొనుగోలుపై 'రాసుకున్నంత బిల్లులు' అన్నట్లుగా మారింది. నాణ్యమైన భోజనం, అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారడంతో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో సంక్షేమ వసతిగృహాల తీరుపై 'సాక్షి' కథనం.

భద్రత అగమ్య గోచరం ..

జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్ల భద్రత అగమ్యగోచరంగా మారింది. ఇటీవల కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో ఓ బాలిక మృతి చెందింది. మంచిర్యాల గిరిజన ఆశ్రమ పాఠశాల, వసతి గృహంలో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. జిల్లాలోని 16 ఎస్టీ ఆశ్రమ, రెండు పోస్టు మెట్రిక్ వసతిగృహాల్లో 3,249 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఎనిమిదేళ్ల క్రితం అన్ని వసతిగృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ ఒక్క దేవాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో మాత్రమే పనిచేస్తుండగా మిగితాచోట్ల వినియోగంలో లేనట్లు అధికారులు పేర్కొంటున్నారు.


జిల్లా కేంద్రంలోని ఓ వసతిగృహంలో నేలచూపు చూస్తున్న సీసీ కెమెరా

బీసీ వసతిగృహాల్లో...

జిల్లాలోని 18 బీసీ వసతిగృహాల్లో ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసింది. జిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయంతో పాటు హైదరాబాద్ బీసీ వెల్ఫేర్ కమిషన్ కార్యాలయంతో అనుసంధానం చేశారు. అధికారుల పనితీరు, విద్యార్థుల అటెండెన్స్, ఇతరత్రా కార్యకలాపాలు నిఘా నేత్రాల సహకారంతో ఉన్నతాధికారులకు పర్యవేక్షణ సులువయ్యేది. ఎనిమిది ప్రీమెట్రిక్ హాస్టళ్లలో 748 మంది, పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో 897 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇందులో మందమర్రి, జైపూర్, మంచిర్యాల, మందమర్రి, లక్సెట్టిపేట బాలికల వసతిగృహాల్లో సీసీ కెమెరాలు వినియోగంలో ఉండగా బాలుర వసతి గృహాల్లో నిరుపయోగంగా మారాయి. ఒక్కొక్కరికి రెండు నుంచి మూడు వసతి గృహాల ఇన్‌చార్జి బాధ్యత ఉండడం, సీసీ కెమెరాలు లేకపోవడంతో పర్యవేక్షణ ఎలా సాగుతుందో అధికారులకే తెలియాలి.

ఎస్టీ వసతి గృహాల్లో అంతంతే..

జిల్లాలో 23 ఎస్టీ వసతిగృహాలు ఉన్నాయి. ఇందులో 15 ప్రీమెట్రిక్ హాస్టళ్లలో 1,237 మంది చదువుతుండగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. ఎనిమిది పోస్టు మెట్రిక్ వసతిగృహాల్లో 830 మంది చదువుతున్నారు. 2016లో ఎనిమిది పోస్టుమెట్రిక్ కళాశాల వసతిగృహాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నాలుగు పనిచేస్తున్నాయి. మంచిర్యాల బెల్లంపల్లి, లక్సెట్టిపేట బాలికలు, మందమర్రి బాలికల, బాలుర కళాశాల వసతిగృహంలో పనిచేస్తున్నాయి.

కరోనా తర్వాత బయోమెట్రిక్ మూలన...


కరోనాతో మూలన పడిన బయోమెట్రిక్ విధానం అమలుపై ఊసేలేకుండా పోయింది. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేకంగా టెక్నీషియన్లను నియమించి వినియోగంలోకి తీసుకురాగా ఎస్టీ, ఎస్సీ, బీసీ వసతిగృహాల్లో మాత్రం విస్మరించారు. బయో పరికరాలు అప్‌డేట్ చేయకపోవడం, బ్యాటరీ పనితీరు, సిమ్ పనిచేయకపోవటం తదితర మరమ్మతులపై దృష్టి సారించకపోవడం, కాలపరిమితి ముగియడంతో బయోమెట్రిక్ అమలులో లేకుండా పోయింది. అధికారులు కూడా ఆదిశగా ఆలోచన చేయడం లేదు.

త్వరలో ఎఫ్ఆర్ఎస్ అమలు!

వసతిగృహాల్లో సంక్షేమాధికారులు, సిబ్బంది కొట్టే డుమ్మాలకు చెక్ పెట్టేందుకు, విద్యార్థుల లెక్క పక్కాగా తేల్చేందుకు ఫేషియల్ రికగ్నేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) అమలుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల ఉన్నతాధికారుల సమావేశంలో ఎఫ్ఆర్ఎస్ అమలుపై ప్రస్తావనకు వచ్చినట్లు ఓ అధికారి పేర్కొన్నారు. ముఖ గుర్తింపు హాజరు ద్వారా విద్యార్థుల సంఖ్య, భోజన సమయంలో హాజరు, వసతిగృహ అధికారులు, సిబ్బంది ఎఫ్ఆర్ఎస్ ముందు నిలబడితే చాలు అన్ని విషయాలు ఇట్టే తెలిసిపోతాయి. భోజనంలో అవకతవకలకు చెక్ పెట్టవచ్చు. ఎంతమంది విద్యార్థులు వస్తే అంతే భోజనం అందించే వీలుంటుంది. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య లెక్కల్లో తేడా కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఎఫ్ఆర్ఎస్ అమలుతో అక్రమాలకు చెక్‌పడే వీలుంది.

గ్రూప్–2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 15, 16 తేదీలో జరుగనున్న గ్రూప్–2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణకు 48 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 14,951 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. నోడల్ అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, పోలీస్ నోడల్ అధికారిగా బెల్లంపల్లి ఏఆర్ ఏసీపీ సుందర్, రీజినల్ కో ఆర్డినేటర్‌గా బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్‌రెడ్డిని నియమించినట్లు తెలిపారు. ఈ నెల 15న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్–2, 16న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్–3, 3 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్–4 పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సకాలంలో పరీక్ష కేంద్రానికి రావాలని సూచించారు.

ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

గ్రూప్–2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు, పరీక్షల ప్రాంతీయ సమన్వయ అధికారి దేవేందర్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం పరీక్షకు 9:30 గంటలకు, మధ్యాహ్నం పరీక్షకు 2:30 గంటలకు గేట్లు మూసివేయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, షూలకు అనుమతిలేదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ బందోబస్తు నిర్వహించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రశ్నా పత్రాలు తరలించే సమయంలో ప్రతీ వాహనానికి ఇద్దరు ఆర్మ్‌డ్ పోలీస్ అధికారులను కేటాయించాలన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రానికి ఒక ఎస్సై, ఒక మహిళా పోలీస్ అధికారిని కేటాయించాలని సూచించారు.

క్లుప్తంగా

నీలుగాయి మాంసం పట్టివేత


పట్టుబడిన నిందితుడితో అటవీ అధికారులు

కడెం: మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన రాయ అంకులు ఇంట్లో గురువారం 5 కిలోల నీలుగాయి మాంసం పట్టుకున్నట్లు కల్లెడ డీఆర్వో డి.ప్రకాశ్ తెలిపారు. అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చి నీలుగాయిని హతమార్చమని, తనతోపాటు మరో ఇద్దరు సీపెల్లి బీమన్న, మాకరెడ్డి ఉన్నారని అంకులు ఒప్పుకున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. పరారీలో ఇద్దరు నిందితులు ఉన్నారని, ముగ్గురిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని డీఆర్వో పేర్కొన్నారు. ఎఫ్‌బీవోలు ప్రసాద్, సరిత సిబ్బంది ఉన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడికి 15 నెలల జైలు

కాటారం: కాటారం మండల కేంద్రంలోని పలు ఇళ్లలో గతేడాది వరుస చోరీలకు పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి పదిహేను నెలల జైలు శిక్ష విధిస్తూ భూపాలపల్లి ఏజేఎఫ్ఎంసీ అడిషనల్ జిల్లా మెజిస్ట్రేట్ జి.అఖిల గురువారం తీర్పు వెలువరించారు. కాటారం ఎస్సై మ్యాక అభినవ్ కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా నీల్వాయి మండలానికి చెందిన చింతకింది సతీశ్ 2023 అక్టోబర్ 22 నుంచి 25వ తేదీ మధ్య మండల కేంద్రంలోని ఆదర్శనగర్‌కాలనీలో ముస్కుల సురేందర్‌రెడ్డి, రేపాల వేణుగోపాల్ ఇళ్లలో చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై అభినవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆధారాలతో సతీశ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తు పూర్తయిన అనంతరం చార్జిషీట్ దాఖలు చేసి గురువారం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పీపీ అర్ధకుమార్.. నేరం రుజువు చేయడంతో జడ్జి అఖిల ఈమేరకు తీర్పునిచ్చారు.

వ్యక్తిపై పోక్సో కేసు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని ఓ బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడుతూ వేధించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాములు తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మంచిర్యాలకు చెందిన శివ ఓ బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడుతూ వేధించసాగాడు. గతకొన్ని రోజులుగా సదరు బాలిక కళాశాలకు వెళ్లడం మానేసింది. ఎందుకు వెళ్లడం లేదని అన్నయ్య నిలదీయడంతో విషయం చెప్పింది. బాలిక అన్నయ్య ఫిర్యాదు మేరకు శివపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు రైలు కిందపడి వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: రైలులో వెళ్తున్న ప్రయాణికుడు ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..బిహార్ రాష్ట్రం మరిచా గ్రామానికి చెందిన అజిత్‌కుమార్(26) కుటుంబ సభ్యులతో కలిసి చెన్నై నుంచి న్యూఢిల్లీకి వెళ్లేందుకు తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరారు. ఫుట్‌బోర్డ్ వద్ద కూర్చొని ప్రయాణిస్తుండగా మంచిర్యాల శివారు రాగానే గురువారం ప్రమాదవశాత్తు కిందపడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఎస్సై తెలిపారు.

టామ్‌కామ్‌తో భరోసా

- ఉపాధి బాటపట్టే నిరుద్యోగులకు
- విదేశాలకు వెళ్లే వారికి ప్రభుత్వ సహకారం
- నైపుణ్యశిక్షణతో ఉద్యోగావకాశాలు



నిర్మల్‌ఖిల్లా: ఉన్న ఊరిలో సరైన ఉపాధి అవకాశాలు దొరకక గల్ఫ్ బాటపడుతున్న ఉమ్మడి జిల్లా వాసులు వేలల్లో ఉన్నారు. ఇంటికి తిరిగి రాలేక అక్కడ సరైన ఉపాధి అవకాశాలు దొరకక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. అలాంటి సమస్యలు తలెత్తకుండా విదేశాల్లో సరైన ఉద్యోగావకాశాలు కల్పించేందుకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) బాసటగా నిలుస్తోంది. 2015లో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏజెన్సీ ఏర్పాటుచేసింది. ఉద్యోగుల కోసం దరఖాస్తు చేసుకుంటే వారి విద్యార్హతలు, నైపుణ్యం మేరకు వివిధ దేశాల్లో ఉన్న ఖాళీల ప్రకారం కొలువులు సమకూర్చే విధంగా సేవలందిస్తోంది. సరైన ఉపాధి అవకాశాల కోసం కావాల్సిన నైపుణ్యాలపై శిక్షణ ఆధ్వర్యంలో అందిస్తోంది.

ప్రభుత్వ సహకారంతోనే..

విదేశాలకు వెళ్లాలనుకునే నిరుద్యోగులకు అక్కడ ఉద్యోగావకాశాలు కల్పించేందుకు టామ్‌కామ్ దాదాపు 20కిపైగా దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకొని ఇక్కడివారికి సరైన ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తోంది. ఉద్యోగాల కల్పన కోసం హైదరాబాద్‌లో విదేశీ ఉద్యోగాలకు సంబంధించిన స్కిల్ టెస్టింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో ఐటీఐ, తదితర వృత్తి కోర్సులు చేసుకుని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాల్లో నమోదు చేసుకుని ఉన్న వారి కోసం టామ్‌కామ్ సమన్వయంతో నిరుద్యోగులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటివరకు యూఏఈ, సౌదీ అరేబియా, ఒమన్, ఇజ్రాయిల్, ఇరాక్, బహ్రెయిన్, జపాన్, జర్మనీ, యుఎస్ఏ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా తదితర 20 దేశాలతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఆయా చోట్ల ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు.

ఈ రంగాల్లో మంచి డిమాండ్..

టామ్‌కామ్ ఒప్పందం కురిసే కుదుర్చుకున్న దేశాల్లో వెల్డింగ్, ఎలక్ట్రీషన్ వంటి పనులతోపాటు భవన నిర్మాణరంగం, డ్రైవింగ్, డెలివరీ బాయ్స్, ఇండస్ట్రీయల్ టెక్నీషియన్‌తోపాటు హాస్పిటల్ రంగాల్లో నర్సింగ్ విభాగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయి. వీటిల్లో నైపుణ్యం కలిగిన నిరుద్యోగులకు అక్కడ మంచి వేతనాలతో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు. జిల్లాకు చెందిన నిరుద్యోగులు విదేశాలకు వెళ్లి ఉద్యోగాలు చేసే ఆసక్తి ఉన్నవారు పూర్తి వివరాలతో టామ్‌కామ్ వెబ్‌సైట్ ద్వారా గానీ, మొబైల్‌లోని ప్లే స్టోర్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ కావల్సి ఉంటుంది. ఆయా దేశాల్లో ఉద్యోగావకాశాలను చూసుకోవచ్చు. ఆ యాప్‌లో అభ్యర్థుల నైపుణ్యాలు, అర్హతల వివరాలను నమోదు అనంతరం సంబంధిత అధికారుల సహకారం తీసుకోవాలి.

అవకాశాలు వినియోగించుకోవాలి



విదేశాలకు వెళ్లాలనుకునే వారు గల్ఫ్ ఏజెంట్ల బారినపడి మోసపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న టామ్‌కామ్ సంస్థ ద్వారా సరైన రంగంలో ఉపాధి పొందేందుకు అవకాశం ఉంది. విదేశాలకు వెళ్లడానికి రిజిస్టర్ చేసుకుంటే అర్హతలు, నైపుణ్యానికి సరిపడా ఉద్యోగం లభిస్తుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– స్వదేశ్ పరికిపండ్ల, గల్ఫ్ కార్మిక సంఘం ప్రతినిధి, నిర్మల్

కన్నబిడ్డను చూపించడం లేదని తండ్రి ఆత్మహత్యాయత్నం

- బెల్లంపల్లిలో ఘటన


చికిత్స పొందుతున్న సుమిత్‌చంద్ర

బెల్లంపల్లి: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యభర్తలకు ఓ బిడ్డ జన్మించాక ఎడబాటు వచ్చింది. అప్పటినుంచి పుట్టిన బిడ్డను చూపించకుండా వేదనకు గురిచేస్తుండటంతో భర్త హెయిర్ డ్రై తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బెల్లంపల్లిలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం..మున్సిపాలిటీ టేకులబస్తీకి చెందిన బొల్లి సుమిత్‌చంద్ర 2001లో బూడిదగడ్డ బస్తీకి చెందిన వెంగళ శిరీషను ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. ఏడాదిపాటు అన్యోన్యంగా దాంపత్యం సాగించిన వీరికి పాప జన్మించింది. ఆ తర్వాత సంసారంలో కలతలు వచ్చాయి. అప్పటి నుంచి భార్యభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. 2003లో భర్తపై భార్య బెల్లంపల్లి వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఆ తర్వాత నుంచి భార్యభర్తలు కోర్టు వాయిదాలకు వెళ్తుండగా శిరీష ఉద్దేశపూర్వకంగా బిడ్డను తనకు చూపించకుండా తండ్రి ప్రేమకు దూరం చేస్తోందని కుమిలిపోతున్నాడు. గురువారం భార్యభర్తలు కోర్టుకు హాజరయ్యారు. బిడ్డ గుర్తుకురావడంతో వెంటనే బూడిదగడ్డ బస్తీలోఅత్తాగారింటికి వెళ్లి బిడ్డను చూపించాలని శిరీషతో గొడవపడ్డాడు. దీంతో శిరీష తాళ్లగురిజాల పోలీసుస్టేషన్‌కు వెళ్లి సుమిత్‌చంద్ర తనపై చేయిచేసుకోవడానికి వచ్చినట్లు పోలీసులకు చెప్పింది. పోలీసులు అతన్ని మందలించారు. తనపై లేనిపోని కల్పితాలు చెప్పి పోలీసుల చేత చీవాట్లు తినిపించడంతో సుమిత్ చంద్ర తట్టుకోలేకపోయాడు. బిడ్డను చూపించకుండా వేధిస్తున్న భార్య శిరీష తీరుతో కలత చెందిన సుమిత్‌చంద్ర వెంట తెచ్చుకున్న హెయిర్ డ్రైని తాళ్లగురిజాల పోలీసుస్టేషన్ ముందు తాగి బలవన్మరణానికి సిద్ధపడ్డాడు. పోలీసులు గమనించి అతన్ని అడ్డుకుని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య


క్రాంతికుమార్ (ఫైల్)

ఇంద్రవెల్లి: కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. రూ కుటుంబీకులు, ఎస్సై సునీ ల్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని ప్ర బుద్ధనగర్ కాలనీకి చెందిన వాగ్మారే క్రాంతికుమార్(36), మేజర్ పంచాయతీ కార్యాలయంలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. గతకొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కుటుంబ స భ్యులు పలు ఆస్పత్రులతోపాటు నాటు వైద్యం చే యించినా నయం కాలేదు. కడుపునొప్పి ఎంతకీ త గ్గకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. గురువా రం ఇంటి వరండాలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నిద్ర లేచిన భార్య కాంతబాయి బయట కు వచ్చి చూడగా..భర్త ఉరేసుకుని కనిపించాడు. విష యం తెలుసుకున్న ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పంచనామా అనంతరం పోసుమార్టం కో సం మృతదేహాన్ని ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పురుగుల మందు తాగి యువకుడు..


సంతోశ్ (ఫైల్)

చెన్నూర్: పట్టణంలోని మహంకాళివాడకు చెందిన యువకుడు లక్కాకుల సంతోశ్ (25) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సుబ్బారావు కథనం ప్రకారం..సంతోశ్ చెన్నూర్‌లోని ముత్తుట్‌ఫైనాన్స్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈయనకు గతంలో కిడ్నీలో రాళ్లు రాగా సర్జరీ అయింది. విధుల్లో ఉన్న సంతోశ్ బుధవారం మధ్యాహ్నం నడుం నొస్తుందని ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి ఫోన్ చేసి గోదావరి నది వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గోదావరి నది వద్దకు వెళ్లి అపస్మారక స్థితిలో పడి ఉండడంతో చెన్నూర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. గురువారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. కిడ్నీ నొప్పి భరించలేక పురుగుల మందు తాగి మృతి చెందాడని అన్న లక్కాకుల సాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి తల్లి, ఇద్దరు సోదరులు ఉన్నారు.

బైక్‌ల చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో ఇటీవల వేర్వేరు చోట్ల జరిగిన బైక్ చోరీకేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్, జూనియర్ సివిల్ జడ్జి కె.నిరోష గురువారం తీర్పు వెలువరించారు. కోర్టు లైజన్ అధికారి గులాం దస్తగిర్ కథనం ప్రకా రం..జిల్లాకేంద్రంలోని గౌతమినగర్‌కు చెందిన మారుకొండ సాయికుమార్, ఆదిలాబాద్ జిల్లా తింతోలికి చెందిన మెస్రం శివప్రసాద్, మంచిర్యాల హమాలివాడకు చెందిన మత్తోజు రమేశ్‌బాబుల మూడు బైక్‌లను 2021 జూన్ 5, 7 తేదీల్లో చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో అప్పటి ఎస్సై వి.ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. నిందితుడు నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం రాంపూర్‌కు చెందిన మ హ్మద్ రజఖ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పీపీ ఎస్.రవీందర్ న్యాయమూర్తి ఎదుట విచారణ చేయగా నేరం రుజువు కావడంతో జడ్జి ఈమేరకు తీర్పునిచ్చారని లైజన్ అధికారి తెలిపారు.

అశ్వినికి రిమాండ్

ముధోల్: మండల కేంద్రంలో బుధవారం వదిన మరదలపై కత్తితో దాడి చేసిన ఘటనలో వదిన అశ్వినికి గురువారం రిమాండ్ విధించారు. సీఐ మల్లేశ్ కథనం ప్రకారం..మరదలు తనుజ పెళ్లి కోసం అన్న డబ్బులు ఖర్చు పెడతాడని ఉద్దేశంతో ఆమెను హత్య చేసేందుకు పూనుకుంది. తనుజపై కత్తితో దాడి చేసినట్లు విచారణలో వెల్లడించిందని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రిమ్స్ ఆవరణలో బు ధవారం గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్లు టూటౌన్ సీఐ క రుణాకర్‌రావు తెలిపారు. మృతుడి వయస్సు 50 నుంచి 60 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. ఆయన శరీరంపై జీన్స్ ప్యాంట్, టీషర్ట్ ఉందని తెలిపారు. ఆయనకు సంబంధించి కుటుంబీకులు ఎవరైన ఉంటే పోలీసులను సంప్రదించాలని వివరించారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు.

అతివలకు ఉపాధి హామీ


ఉపాధి పని చేస్తున్న కూలీలు

- ఆరు రకాల పనులకు ప్రాధాన్యం
- సింహభాగం మహిళలదే..

కోటపల్లి: 2025–26 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నాటికి..ఈ సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా గుర్తించిన పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా జిల్లా గ్రామీణభివృద్ధి శాఖ పనులను వేగవంతం చేసింది. గత అక్టోబర్ 2 నుంచి గ్రామ సభల్లో ఆమోదించిన పనులు వచ్చేఏడాది మార్చి 31 నాటికి పూర్తి చేయడానికి మండలం యూనిట్‌గా ఈ పనులు సకాంలో పూర్తి చేయాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. ఈనేపథ్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వం సూచించిన 6 రకాల పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వెయ్యికిపైగా పనులు గుర్తించారు. సింహభాగం మహిళలకు భాగస్వామ్యం కల్పించాలని నిర్ణయించారు.

మహిళాశక్తికి భరోసా: మహిళా సంఘా సభ్యులందరికీ ఉపాధి భరోసా కల్పించేలా ఉపాధి పథకంలో భాగస్వాములను చేయనున్నారు. వారిని స్వయం ఉపాధివైపు మళ్లించేలా రుణాలిచ్చి ఆవులు, మేకల, పెంపకం చేపట్టేలా చేస్తారు. పశువుల షెడ్లు, వర్మీ కంపోస్టు, అజోం మొక్కల పెంపకం బీడు భూములను అభివృద్ధి చేస్తారు.

ఉమ్మడి జిల్లాలో ..

జిల్లా	మండలాలు	పంచాయతీలు	జాబ్‌కార్డులు	కూలీలు
ఆదిలాబాద్	17	468	1,75,747	3,70,082
కుమురంభీం	15	335	1,29,885	2,77,287
నిర్మల్	18	396	1,80,572	3,70,550
మంచిర్యాల	16	311	1,21,067	2,55,151

పొలం బాటలు: గ్రామాల్లో పంట ఉత్పత్తులను ఇంటికి చేర్చడానికి ఈసారి మట్టిదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. జిల్లాల్లో 60 కి.మీ రోడ్డు పనులు చేపట్టనున్నారు.

ఫలాల వనాలు: ఉద్యానశాఖ అధ్వర్యంలో పండ్లతో పంటల ద్వారా రైతులను ప్రొత్సహించడం, వాటికి రాయితీపై బిందు, తుంపర్ల పరికరాలు ఇచ్చేలా చేస్తారు. ఈత తాటి వనాలు పెంచుతున్నారు. జిల్లాలో ఎంపిక చేసిన నర్సరీల్లో ఈ పనులు చేపట్టనున్నారు.

జలనిధి: జల సంరక్షణలో ప్రజలను భాగసామ్యం చేయడం, ఇంటింటా ఇంకుడుగుంతలు, ఫారం పొండ్లు, ఇంటి కప్పు భాగంలో కురిసిన నీటిని భూగర్భంలోకి ఇంకించడం, చేతిపంపుల వద్ద ఇంకుడు గుంతలు, కందకాలు తవ్వడం, చెక్‌డ్యాం కట్టేలా చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలో మొత్తం 27 పనులు చేపట్టనున్నారు.

గ్రామీణ పారిశుధ్యం: గ్రామాల్లో వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఒక్కో మండలంలో కనీసం 10 చొప్పున ఇంకుడుగుంతలను చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

మౌలిక సదుపాయాలు: గ్రామాల్లోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో బాలికలు, బాలురకు వేర్వేరుగా మరుగుదొడ్ల ఏర్పాటు, సిమెంట్ రహదారులు నిర్మాణం, అంగన్‌వాడీ భవనాలు నిర్మించనున్నారు. వీటిని మండలానికి ఐదు చొప్పున చేపట్టనున్నారు.

సకాలంలో పూర్తి చేస్తాం

జిల్లాలో గ్రామసభల్లో గుర్తించిన పనులు సకాలంలో పూర్తిచేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. నిర్దేశించిన సమయంలోగా పనులు పూర్తిచేస్తాం. అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– కిషన్, డీఆర్‌డీవో, మంచిర్యాల

స్మగ్లింగ్ నిరోధానికి ఫారెస్ట్ మార్చ్

- నూతన ప్రయోగానికి శ్రీకారం
- ఇందన్‌పల్లి రేంజ్‌లో అమలు


సోనాపూర్ తండా బీట్‌లో ఎఫ్ఆర్వో, అధికారులు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లో విలువైన టేకు కలపను స్మగ్లర్లు తరలిస్తుండడం అటవీశాఖకు తలనొప్పిగా మారింది. కలప స్మగ్లింగ్ నిరోధించడానికి అధికారులు వివిధ ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా వారి కళ్లుగప్పి తరలిస్తున్నారు. ఈక్రమంలో జన్నారం అటవీ డివిజన్‌లోని ఇందన్‌పల్లి అటవీరేంజ్‌లో ఫారెస్ట్ అధికారి కారం శ్రీనివాస్ నూతన ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో మొదటిసారిగా రేంజ్ పరిధిలో సిబ్బందితో కలిసి ఫారెస్ట్ మార్చ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సిబ్బంది మూకుమ్మడిగా అడవిలో స్మగ్లింగ్ నిరోధానికి ముందస్తు తనిఖీ చేస్తారు. అటవీ ప్రాంతంలోని బీట్‌ను ఎంచుకుని క్షుణ్ణంగా పరిశీలించి అన్ని కంపార్టుమెంట్లలో తనిఖీ చేస్తారు. చెట్లు నరికివేతకు గురైతే వివరాలు సేకరిస్తారు. కారణం కనుక్కుని ఆ దిశగా చర్యలు తీసుకుంటారు. పడిపోయిన కలప ఉంటే టింబర్ డిపోకు తరలిస్తారు. ప్రతీవారం అడవిలో పరేడ్, బీట్లవారీగా ఫారెస్ట్ మార్చ్ నిర్వహిస్తారు. సిబ్బంది కొందరు విధుల్లో నిర్లక్ష్యం కారణంగా కలప తరలిపోతుందనే ఆరోపణల దృష్ట్యా ఫారెస్ట్ మార్చ్ ప్రారంభించారు. ఏ బీట్ పరిధిలో నిర్వహిస్తారనేది గోప్యంగా ఉంచుతారు. ఫారెస్ట్ మార్చ్ వల్ల సిబ్బందికి బీట్‌లోని కంపార్టుమెంట్ల వారీగా అడవిపై అవగాహన కలుగుతుందని, వన్యప్రాణులను రక్షిస్తూనే అభివృద్ధి పనులతోపాటు స్మగ్లింగ్ నిరోధానికి పెద్దపీట వేయడానికి ఈ కార్యక్రమం చేపట్టామని ఫారెస్ట్ రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు.

సైబర్ వలలో ప్రైవేట్ ఉద్యోగి

- రూ.9 లక్షల టోకరా
- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు
- జిల్లాకేంద్రంలో ఘటన

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలోని కొత్త కుమ్మర్‌వాడకు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి సైబర్ మోసగాళ్ల వలలో చిక్కుకున్నాడు. కష్టపడి సంపాదించిన డబ్బులు సైబర్ నేరగాళ్లకు దారాదత్తం చేశాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో రూ.9లక్షలు చేజారిపోయాయి. వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ కథనం ప్రకారం.. ఆ ప్రైవేట్ ఉద్యోగి గత వారం క్రితం టెలిగ్రామ్ వచ్చిన ఓ యాడ్‌ను చూసి రూ.30 వేలు డబ్బులు వారికి పంపించాడు. వెంటనే రూ.36వేలు తిరిగి రావడంతో మరింతగా ఆశ పెంచుకున్నాడు. వారు ఇచ్చిన యాడ్‌లు చూసి ఇంటి వద్దే ఉంటూ వేల రూపాయలు సంపాదించవచ్చని అనుకున్నాడు. ఇలా తొమ్మిదిసార్లు రూ.లక్ష చొప్పున సైబర్ నేరగాళ్లకు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపించారు. వారం రోజులైనా తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి ఆయన గురువారం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు. సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడంతో రూ.1లక్ష 2వేలు సీజ్ చేశారు. ఈ డబ్బులు మాత్రమే బాధితుడికి అందనున్నాయి. మిగతా డబ్బుల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. ప్రైవేట్ యాప్‌లు, లింక్‌లు, సైట్‌లను ఓపెన్ చేసి మోసపోవద్దని, సోషల్ మీడియాలో వచ్చే యాప్‌లను నమ్మి డబ్బులు పంపొద్దని సూచించారు. ఎవరైన మోసపోయిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

జీరో హార్మ్ సింగరేణి నినాదం


మాట్లాడుతున్న సూర్యనారాయణ

- జీఎం ఎల్వీ సూర్యనారాయణ

శ్రీరాంపూర్: జీరో హార్మ్ సింగరేణి నినాదమని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ తెలిపారు. గురువారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్‌గనిలో 50వ రక్షణ వార్షిక పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సింగరేణిలో రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి ఇంటి నుంచే రక్షణతో విధులకు హాజరుకావాలన్నారు. రక్షణ పరికరాలైన బూట్లు, హెల్మెట్, రేడియం జాకెట్ యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రతి ఉద్యోగి రక్షణ సూత్రాలను పాటించాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు రక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. 2022 వార్షిక రక్షణ ఔపక్షోత్సవాల్లో సాధించిన 3వ బహుమతిని అందించారు. గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి టి.శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, రక్షణ కమిటీ సభ్యులు గార్బియల్ రాజు, మహేంద్రనాథ్, హనుమాన్‌గౌడ్, మురళీధర్, గని మేనేజర్ బ్రహ్మాజీ, రక్షణ అధికారి శ్రీనివాస్, సంక్షేమాధికారి బి.శంకర్, పిట్ కార్యదర్శి మోతె లచ్చన్న పాల్గొన్నారు.

ఐరన్ డోర్‌ను పట్టుకున్న ఎస్అండ్‌పీసీ


ఐరన్ డోర్, ఆటోను గోలేటి 1కు తీసుకువచ్చిన సిబ్బంది

రెబ్బెన/తాండూర్: బెల్లంపల్లి ఏరియా మాదారం టౌన్‌షిప్‌లోని సింగరేణి క్వార్టర్ నుంచి ఐరన్ డోర్ తొలగించి స్క్రాప్‌కు తరలిస్తుండగా ఎస్అండ్‌పీసీ సిబ్బంది గురువారం పట్టుకున్నారు. ఎస్అండ్‌పీసీ జమేదార్ దశరథం పటేల్ ఆధ్వర్యంలో ఎస్అండ్‌పీసీ సిబ్బంది మాదారం టౌన్‌షిప్‌లో తనిఖీ చేపట్టారు. అదే సమయంలో ఆటోలో సింగరేణి క్వార్టర్లకు చెందిన ఐరన్‌డోర్‌ను తరలిస్తుండగా గ్రామ శివారులో సిబ్బంది పట్టుకున్నారు. ఐరన్‌డోర్‌తోపాటు డోర్‌ను తరలించేందుకు ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకుని గోలేటి–1 ఇంక్‌లైన్‌కు తరలించారు. పట్టుబడిన డోర్ విలువ రూ.10 వేలు ఉంటుందని జమేదార్ దశరథం తెలిపారు. సిబ్బంది తుపాన్ మండల్, గోర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సదర్‌మాట్ బ్యారేజీలో మొసళ్లు


సదర్‌మాట్ బ్యారేజీ రోడ్డుపైకి వచ్చిన మొసలి

మామడ: నిర్మల్ జిల్లా మామడ మండలం సదర్‌మాట్ బ్యారేజీలో గురువారం రెండు మొసళ్లు కని పించాయి. బ్యారేజీ రోడ్డుపైకి రావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. చేపల వేటకు వెళ్లిన వారికి మొసలి కనిపించడంతో బ్యారేజీ బయటకు వచ్చారు. బ్యారేజీ రోడ్డుపైకి వచ్చిన మొసలి సాయంత్రం మళ్లీ బ్యారేజీలోకి వెళ్లింది. బ్యారేజీలోకి స్నానానికి వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–14 జిల్లా క్రికెట్ టీం ఎంపిక పోటీలను పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. గురువారం ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి 100 మంది హాజరుకాగా, ప్రతిభ కనబర్చిన 18 మందిని జట్టుగా ఎంపిక చేశారు. జిల్లా సెక్రెటరీ కోదాటి ప్రదీప్, హెచ్‌సీఏ జిల్లా కోచ్ పి.ప్రదీప్, చందు, తిరుపతి, సుధీర్, రాకేశ్ పాల్గొన్నారు.

ఎంపికైన జట్టు క్రీడాకారులు..

ఉమ్మడి జిల్లా జట్టులో మంచిర్యాల నుంచి వి.లక్ష్మణ్ సాయి, బి.అర్జున్, ఏ.రిషికేష్ చంద్ర, ఆదిలాబాద్ నుంచి పి.మోక్షిత్, జే.అన్వేష్, యశ్‌రాజ్ సింగ్, అనాస్, డి.రిషి, బి.దినేశ్ రాజ్, కే.ఇషాంత్, కె.వర్శిల్, నిర్మల్ నుంచి ఆర్.ధనుష్, మీర్జా రుబ్బాన్, వై.రోహిత్‌లు, స్టాండ్ బైలో మంచిర్యాల నుంచి ఎస్‌కె జహీర్, టి.సాత్విక్, నిర్మల్ నుంచి ఈ. శైలేష్, ఆదిలాబాద్ నుంచి శౌర్యలను ఎంపిక చేశారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ

ఇచ్చోడ: మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఈఎంటీ కృష్ణ, పైలెట్ ఆలీంలు అంబులెన్స్‌లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు.